
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ׀ 5 ׀ ఏప్రిల్ ׀ 2024



సోమశిలలో 9.35 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 9.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.72,,170
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,446
3శాతం జీఎస్టీతో	రూ.6,639
సవర (8గ్రాములు)	రూ.53,112

గరిష్టం/కనిష్టం

39.6 /26.5

వాతావరణం

గాలిలో తేమ 63 శాతంగా గురువారం నమోదైంది. ఉష్ణోగ్రతలు శుక్రవారం పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.



ఇఫ్తార్	సహర్
శుక్రవారం	శనివారం
6:27	4:45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పోలింగ్‌కు 14,945 మంది సిబ్బంది



ర్యాండమైజేషన్ కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పోలింగ్ నిర్వహణకు 14,945 మందిని కేటాయించామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. పోలింగ్ అధికారుల కేటాయింపునకు సంబంధించిన మొదటి విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 2470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. 2900 మంది అధికారులు.. 2914 మంది అసిస్టెంట్ అధికారులు, 9131 మంది ఇతర పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని వివరించారు. డీఆర్వో లవన్న, ముఖ్య ప్రణాళికాధికారి రాజు, డీఈఓ రామారావు, జిల్లా ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతుండటంతో విద్యుత్ ఉత్పత్తిని క్రమంగా పెంచుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని నేలటూరులో గల దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఒకటో యూనిట్‌లో 430.. రెండో యూనిట్‌లో 545.. మూడో యూనిట్‌లో 610 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు తెలిపారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ



నెల్లూరు(బారకాసు): శిక్షణ తరగతులతో ఎన్నికల అధికారులకు అన్ని అంశాల్లో అవగాహన కల్పించామని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో మెటీరియల్ పరిశీలన.. మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నాక పోలింగ్ కేంద్రాలకు తరలించడం.. మాక్ పోలింగ్, ఈవీఎంల సీలింగ్.. తదితరాలపై అవగాహన కల్పించామని వివరించారు. అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

- బస్సు డ్రైవర్ మృతి



నుజ్జునుజ్జయిన వాహనాలు

కోవూరు(కొడవలూరు): రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని రాజుపాళెం వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కావలికి బయల్దేరింది. ఈ తరుణంలో రాజుపాళెం సమీపంలో జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న టిప్పర్ బస్సును అధిగమించే క్రమంలో వెనుకవైపు నుంచి ఢీకొంది. ప్రమాదంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ భాస్కర్ (50) తీవ్రంగా గాయపడ్డారు. 108లో నెల్లూరు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వివరాలను ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ ప్రదాత.. జయహో



జిల్లాకు చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర

- చింతారెడ్డిపాళెం వద్ద బస
- యాత్రకు నేడు విరామం
- జననేతను చూసేందుకు ఉవ్విళ్లూరుతున్న ప్రజానీకం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర నెల్లూరుకు గురువారం రాత్రి చేరుకుంది. తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో మేమంతా సిద్ధం సభను పూర్తి చేసుకొని, గూడూరు మీదుగా నెల్లూరు రూరల్ పరిధిలోని చింతారెడ్డిపాళెం వద్దకు ఆయన చేరుకున్నారు.

యాత్ర రేపు పునఃప్రారంభం

బస్సుయాత్రకు శుక్రవారం విరామం ప్రకటించారు. చింతారెడ్డిపాళెం వద్ద బస చేసే సీఎం అక్కడే విశ్రాంతి తీసుకోనున్నారు. ఆపై నెల్లూరు రూరల్ పరిధి నుంచి బస్సుయాత్ర శనివారం ఉదయం ప్రారంభంకానుంది. కావలిలో అదే రోజు మధ్యాహ్నం నిర్వహించే మేమంతా సిద్ధం సభలో పాల్గొననున్నారు.

ప్రగతిలో జిల్లా పరుగులు

- గడిచిన ఐదేళ్లలో వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో ప్రగతి పరుగులు పెట్టింది. పేదలకు రూ.9893 కోట్ల లబ్ధిని వారి ఖాతాల్లోకి జమ చేశారు.
- నాన్ డీబీటీ ద్వారా రూ.43.62 కోట్లతో సంక్షేమ ఫలాలను అందించారు.
- సాగునీటి రంగం , పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి సారించి ప్రగతిని పరవళ్లు తొక్కించారు.
- రూ.960 కోట్లతో సోమశిల – కండలేరు వరద కాలువ ఆధునికీకరణ.. రూ.840.90 కోట్లతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణం.. కండలేరు ఆధునికీకరణ కోసం రూ.960 కోట్లను కేటాయించారు.
- రూ.117 కోట్లతో సోమశిల ఆప్రాన్ పనులు, రూ.99.95 కోట్లతో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ.. రూ.611 కోట్లతో సంగం, నెల్లూరు బ్యారేజీ పనులను పూర్తి చేసి ఆయన ప్రారంభించారు.
- రూ.3743 కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు.. రూ.289 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడిన తమ అభిమాన నేతకు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు.

ఘన స్వాగతం

నెల్లూరు(పొగతోట) / నెల్లూరు (దర్గామిట్ట): మనుబోలు వద్ద జిల్లాలోకి ప్రవేశించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాత్రి 8.15కు నగరంలో ఏర్పాటు చేసిన క్యాంపునకు ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి, పార్టీ నెల్లూరు సిటీ, రూరల్, వెంకటగిరి అభ్యర్థులు ఖలీల్ అహ్మద్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కావలి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్ చక్రవర్తి కలిశారు.

కావలిలో 'మేమంతా సిద్ధం'



మేమంతా సిద్ధం అంటూ సభా వేదిక వద్ద నినాదాలు చేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

కావలి: పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ సునామీ సృష్టించడం ఖాయమని చెప్పారు. సీఎం ఏ ఊరెళ్లినా అక్కడ పండగ వాతావరణం నెలకొంటోందని తెలిపారు. జగన్ నాయకత్వంపై ప్రజల్లో బలంగా నాటుకుపోయిన విశ్వాసానికి ఇది ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. మేమంతా సిద్ధం సభకు దాదాపు లక్షన్నర మందికిపైగా ప్రజలు హాజరుకానున్నారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని.. ఎప్పుడైనా తనను నిర్భయంగా కలవచ్చని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. నూతన ఎస్పీగా బాధ్యతలను గురువారం రాత్రి ఆయన స్వీకరించారు. అనంతరం జిల్లా పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బెంగళూరుకు చెందిన ఆరిఫ్ హాఫీజ్ 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తొలి పోస్టింగ్‌లో నర్సీపట్నం ఏఎస్పీగా, అనంతరం రంపచోడవరం ఓఎస్డీగా విధులు నిర్వర్తించారు. గుంటూరు రూరల్, అర్బన్ జిల్లాల ఎస్ఈబీ ఏఎస్పీగా పనిచేశారు. 2021లో గుంటూరు అర్బన్ ఏఎస్పీగా, జిల్లాల పునర్విభజన అనంతరం గుంటూరు జిల్లా ఎస్పీగా ఈ ఏడాది జనవరి వరకు పనిచేశారు. బదిలీల్లో ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీగా పని చేస్తున్న తిరుమలేశ్వర రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేయడంతో ఆయన స్థానంలో ఆరిఫ్ హాఫీజ్ బాధ్యతలను స్వీకరించారు. ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు ఎస్పీని కలిశారు.

జగనన్నను సీఎం చేసేందుకు ప్రజలు సన్నద్ధం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: ప్రతిపక్ష పార్టీలు, పచ్చమీడియా కలిసి ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా.. సంక్షేమ పాలనను అందించిన జగనన్నను ప్రజల నుంచి దూరం చేయలేరని.. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వీర్లగుడిపాడులో ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఆయన నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పార్టీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో వీర్లగుడిపాడు పంచాయతీలో 312 మంది లబ్ధిదారులకు పథకాల రూపంలో రూ.4.97 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రజలు తెలిపిన రెవెన్యూ సమస్యలను అధిక భాగం పరిష్కరించామని చెప్పారు. వలంటీర్ల సేవలను ప్రతిపక్ష పార్టీలు అడ్డుకోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. సంక్షేమం ప్రతి ఇంటికీ చేరిందని, అందుకే ఓట్లు అడిగేందుకు ధైర్యంగా వస్తున్నామన్నారు. జగనన్న నిర్వహించిన నాలుగు సిద్ధం సభలకు లభించిన ప్రజాదరణను చూసి ప్రతిపక్ష పార్టీల నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కావలిలో శనివారం నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభకు ఆత్మకూరు నుంచి భారీగా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ఆత్మకూరు జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, రావుల ప్రసాద్‌గౌడ్, చంద్రా హజరత్ నాయుడు, గుర్రం నరేష్, కరకంబాకం శంకరయ్య, సర్పంచ్ మానికల చందన్‌కుమార్, మాంజాన్‌బాషా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల బాహాబాహీ

- సూరా, పుట్టా మధ్య దూషణల పర్వం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికలు సమీపించే కొద్దీ తమ్ముళ్ల మధ్య విభేదాలు తీవ్రమవుతున్నాయి. పెనుబల్లిలో టీడీపీ కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి ప్రచారం సందర్భంగా పార్టీ స్థానిక నేత సూరా శ్రీనివాసులురెడ్డిని కాన్వాయ్ నుంచి నెట్టేసిన ఘటనను మరువకముందే తాజాగా ఈ ఉదంతం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. పట్టణంలోని ముంబై రోడ్డులో గల లోటస్ గ్రాండ్ రెస్టారెంట్ పక్కన టీడీపీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించాల్సి ఉంది. దీనికి ప్రశాంతిరెడ్డి రావాల్సి ఉంది. ఈ తరుణంలో కార్యాలయంలో కూర్చొని ఉన్న సూరా.. పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు ఒకర్నొకరు దూషించుకున్నారు. నువ్వెంతంటే.. నువ్వెంత అంటూ బాహాబాహీకి దిగారు. ఘటనతో కంగుతిన్న టీడీపీ సీనియర్ నేతలు వీరికి సర్దిచెప్పేందుకు యత్నించారు. అయినా గొడవ సద్దుమణగలేదు. దీంతో సూరా శ్రీనివాసులురెడ్డిని అక్కడున్న నేతలు బయటకు తీసుకెళ్లారు. ప్రశాంతిరెడ్డి వచ్చి కార్యాలయాన్ని ప్రారంభించాక ఏమీ మాట్లాడకుండానే వెనుదిరిగారు.

వైఎస్సార్సీపీని దీవించండి



21వ డివిజన్లో ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయనున్న విజయసాయిరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి సునంద.. నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమార్తె హిమబిందు నగరంలో ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు సిటీ



జెండావీధిలో ప్రచారం చేస్తున్న సునంద విజయసాయిరెడ్డి

శాపంగా నారాయణ గారడీలు

- భూగర్భ డ్రైనేజీ పేరిట నగరపాలక సంస్థపై అప్పుల భారం
- 2016లో 9.95 శాతం వడ్డీకి రూ.830 కోట్ల హడ్కో రుణం
- ఏటా వడ్డీ భారం రూ.55 కోట్లు
- పనుల పూర్తికి మరో రూ.240 కోట్లు అవసరం

'నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తున్నాం.. నగర సుందరీకరణే నా ధ్యేయం.. భూగర్భ డ్రైనేజీతో మెరుగైన పారిశుధ్యాన్ని అందిస్తాం' అంటూ గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా వ్యవహరించిన నారాయణ తన ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను ఆ రోజుల్లో ఊదరగొట్టారు. ఇవన్నీ జరగకపోగా.. తన లోపభూయిష్ట విధానాలతో నెల్లూరు నగరపాలక సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారు. హడ్కో ద్వారా రుణాలను తీసుకొచ్చి.. పనులను చేయకుండానే నిధులను దిగమింగారు. ఈ పరిణామాలతో ఆ అప్పులపై కార్పొరేషన్ ఏటా రూ.55 కోట్ల వడ్డీని కడుతోంది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత టీడీపీ హయాంలో మంత్రిగా వ్యవహరించిన నారాయణ పాపాలు నగర వాసులను నేటికీ వెంటాడుతున్నాయి. వీటన్నింటినీ విస్మరించి తాజాగా జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపించాలంటూ ఆయన అవాస్తవాలను ప్రచారం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. 'నారాయణ అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే నారాయణ' అంటూ నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారు.

9.95 శాతం వడ్డీకి అప్పు

నగరపాలక సంస్థలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా కోసం రూ.1136 కోట్ల రుణానికి హడ్కోను ఆశ్రయించారు. ఇందులో తాగునీటి సరఫరా కోసం రూ.556 కోట్లు, భూగర్భ డ్రైనేజీకి రూ.580 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే హడ్కో రూ.830 కోట్లను 9.95 శాతం వడ్డీకి 2016లో మంజూరు చేసింది. అయితే నామమాత్రపు పనులతో 2018 వరకు కాలం వెళ్లదీశారు.

గత ఎన్నికలకు ముందు హడావుడిగా..

గత ఎన్నికలకు కొన్ని నెలల ముందు రెండు ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు టెండర్లను ఖరారు చేశారు. అప్పటికే నగరంలో ఒకట్రెండు వీధుల్లో మినహా మిగిలిన అన్ని రోడ్లు బాగానే ఉన్నాయి. భూగర్భ డ్రైనేజీ పేరుతో రోడ్లను తవ్వి.. అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. ధ్వంసమైన రోడ్లపై నడిచేందుకు సైతం వీల్లేని పరిస్థితి ఏర్పడింది. భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లను అన్ని వీధుల్లో వేస్తేనే గానీ సిమెంట్ రోడ్ల నిర్మాణానికి వీలుంటుంది. ఈ తరుణంలో గుంతలమయమైన రోడ్లతో ప్రజలు నరకాన్ని చవిచూశారు.

డివిజన్ ఇన్‌చార్జీలకు సబ్ కాంట్రాక్టులు..!

సిమెంట్ రోడ్ల పనులను తమకే కేటాయించాలంటూ నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్ల టీడీపీ ఇన్‌చార్జీలు నారాయణపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీలతో మాట్లాడి నిర్మాణాల పనులు వారికి అప్పగించారు. ఈ తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందనగా, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఎత్తుపల్లాలుగా.. అత్యంత నాసిరకంగా రోడ్లను నిర్మించారు. కొన్ని వీధుల్లోని రోడ్లు వారానికే కుంగిపోయాయంటే నాణ్యత ఎలా ఉంతో అర్థం చేసుకోవచ్చు. గుంతలమయంగా.. వర్షమొస్తే చెరువులను తలపిస్తూ.. పైప్‌లైన్ల లీకేజీలు.. ఇలా రోడ్లు దుర్భరంగా మారాయి. చిన్నపాటి లీకేజీని సైతం సరిదిద్దేందుకు రోడ్లను ధ్వంసం చేయాల్సిన పరిస్థితి ఉండేది.

వడ్డీ భారం ఇలా..

హడ్కో నుంచి తెచ్చిన రుణానికి 9.95 శాతం వడ్డీని ఏటా చెల్లించాలి. అసలు కింద రూ.80 కోట్లు.. వడ్డీగా రూ.55 కోట్లు.. ఇలా ఏడాదికి రూ.135 కోట్లను నగరపాలక సంస్థ చెల్లించాల్సి వస్తోంది. ఆరేళ్లుగా రూ.810 కోట్లను కార్పొరేషన్ చెల్లించింది. ఈ లెక్కన ఇంకా దాదాపు రూ.400 కోట్లను అసలు, వడ్డీ కింద జమ చేయాల్సి ఉంది. ఇలా నగరపాలక సంస్థను అప్పుల ఊబిలోకి నారాయణ లాగారు.

అసంపూర్తిగా ఉన్నా.. బిల్లుల మంజూరు

హడావుడిగా చేసిన పనులకు బిల్లులను మాత్రం పూర్తిగా తీసుకున్నారు. పనులు అసంపూర్తిగా ఉన్నాయని.. బిల్లులను మంజూరు చేయలేమని ఇంజినీరింగ్ అధికారులు చెప్పినా, నారాయణ మౌఖిక ఆదేశాలతో వీటికి ఇవ్వక తప్పలేదు. కొన్ని బిల్లులను అధికారులు క్లియర్ చేయకపోవడంతో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

స్వచ్ఛ నీరు.. కాలువల పాలు

నగర వాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో పైపులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేసి ఓపెన్‌గా వదిలేశారు. ఈ పైపుల ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేసి.. వినియోగాన్ని లెక్కకట్టేందుకు మీటర్లను బిగిస్తామని చెప్పారు. అయితే ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆ ఓపెన్ పైపుల ద్వారా విడుదలయ్యే నీరు కాలువల పాలైంది. మరికొన్ని చోట్ల పైపులు చోరీకి గురయ్యాయి. నగరంలో అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, స్వచ్ఛమైన తాగునీటి పనులను పూర్తి చేయాలంటే మరో రూ.240 కోట్లు అవసరమవుతాయని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా

స్నేహితురాలి మరణాన్ని తట్టుకోలేక..

- బాలిక ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): స్నేహితురాలి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తెల్లవారుజామున నెల్లూరులోని హరనాథపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం ఒకటో వీధిలో పెంచలయ్య, కుమారి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి అజయ్, అశ్విని (15)లు సంతానం. అశ్విని పదో తరగతి పరీక్షలు రాసింది. ఇటీవల ఆమె స్నేహితురాలు నీటిగుంతలో పడి చనిపోయింది. ఈ విషయాన్ని మరో స్నేహితురాలు బుధవారం అశ్వినికి ఫోన్ చేసి చెప్పింది. అప్పటి నుంచి ఆమె బాధపడుతోంది. గురువారం తెల్లవారుజామున తన గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లిచూడగా అప్పటికే బాలిక మృతిచెందింది. ఈ మేరకు బాధిత తండ్రి బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 153
లేయర్ (లైవ్)	: 82
బ్రాయిలర్ చికెన్	: 268
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 294
లేయర్ చికెన్	: 140



స్మార్ట్ ఎలక్షన్



ఎన్నికల్లో ఐటీ ఆధారిత సేవలు

- సాంకేతిక సేవలు విస్తృతంగా వినియోగం
- ఓటరు నమోదు నుంచి ఫిర్యాదుల వరకు యాప్స్
- అక్రమాలపై ఫిర్యాదులకు 'సీ విజిల్'
- రాజకీయ పార్టీలు అనుమతులు పొందేందుకు 'సువిధ'

కాలం మారింది. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రతి రంగం ఐటీ ఆధారిత సేవలను వినియోగించుకుంటోంది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు అనేక సేవలు సులువుగా అందుతాయి. ఎన్నికల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఈసీ ప్రవేశపెట్టింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీ తదితర వాటి కోసం యాప్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వాటిపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. – నెల్లూరు సిటీ

ఓటర్ హెల్ప్‌లైన్



ఓటరు సంబంధిత సేవలను యాక్సెస్ చేసేందుకు ఈ యాప్‌ను రూపొందించారు. ఎన్నికలకు సంబంధించిన సేవల్ని పొందేందుకు ప్రజలకు అనుసంధానకర్తగా ఈ యాప్ ద్వారా ఈసీ వ్యవహరిస్తుంది. దీనిలో కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చు. డిజిటల్ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలోని జనాభా, ఇతరుల పేర్లు, వివరాలను తెలుసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన తాజా సంక్షిప్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు ఈ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చు.

సీ విజిల్ ద్వారా ఫిర్యాదు



ఎన్నికల కమిషన్ తెచ్చిన ముఖ్యమైన వాటిల్లో సీ విజిల్ యాప్ ఒకటి. డౌన్‌లోడ్ చేసుకున్నాక మొబైల్ నంబర్, చిరునామాతో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లోకి లాగిన్నైనప్పుడు ఫొటో, వీడియో ఐకాన్లను చూడగలుగుతారు. నగదు, మద్యం పంపిణీ, బహుమతులు, పోస్టర్లు, బ్యానర్లు, తుపాకులు, వంటి ఆయుధాల ప్రదర్శన, బెదిరింపు, పెయిడ్ న్యూస్, ఆస్తులు ధ్వంసం చేయడం తదితర వాటిని ఎవరైనా కెమెరాతో తీసి అప్‌లోడ్ చేయొచ్చు.

అనుమతి కోసం..

ఇది రాజకీయ పార్టీలకు సంబంధించింది. ఎన్నికల ప్రచారంలో అనుమతులకు వినియోగించుకోవచ్చు. యాప్ ద్వారా పొందిన అనుమతులు, వాటి ఖర్చులను అభ్యర్థులు నామినేషన్ వేసే వరకు సంబంధిత రాజకీయ పార్టీల ఖాతాలోనూ, నామినేషన్లు వేసిన తర్వాత అభ్యర్థి ఖాతాలో నమోదు చేస్తారు. వాహనాలకు, మైక్ సెట్ల వినియోగానికి, బహిరంగ సభలు, సమావేశాలకు రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకుంటే 24 నుంచి 48 గంటల్లో అనుమతి ఇస్తారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సేవలకు 'సాక్ష్యం'



ఎన్నికల నిబంధనలు, సేవలు వంటి అంశాలపై దివ్యాంగులకు అవగాహన కలిగించే యాప్ సాక్ష్యం. ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఎన్నికల సేవల్ని అభ్యర్థించడానికి దోహదపడుతుంది. ఇందులో వాయిస్ టైపింగ్ టూల్, యాక్సెసిబిలిటీ ఫీచర్లు, పోలింగ్ స్టేషన్ల సమాచారం ఉంటుంది. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు కూడా చేయొచ్చు.

కేవైసీ యాప్



ఇందులో పోటీలో ఉన్న రాజకీయ పార్టీ అభ్యర్థుల వివరాలన్నీ ఉంటాయి. నేర చరిత్రను పౌరులు తెలుసుకునేందుకు దోహదపడుతుంది. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, నేరారోపణలను తెలియజేస్తుంది. నామినేషన్ల జాబితా, ఎన్నికల విధానాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏ నియోజకవర్గానికి ఏ అభ్యర్థి పోటీ చేస్తున్నారో తెలుసుకునే అవకాశం ఉంది.

పబ్లిక్ పోర్టల్

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తన ఓటు ఉందా?, లేదా?, ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది?, అది ఎక్కడ ఉంది? బూత్ లెవల్ అధికారి ఎవరు? ఫొటో ఓటర్ గుర్తింపు కార్డు సంఖ్య వంటి ఓటర్లకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాటు చేశారు.

సుగం యాప్

ప్రచార వాహనాల నియంత్రణకు యాప్ ఉపయోగపడుతుంది. వాహనాలు నిబంధనలకు లోబడి ఉన్నాయా? లేదా? అని యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.

డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లకు గూగుల్ ప్లేస్టోర్లో, ఐఓఎస్ యూజర్లకు యాప్ స్టోర్లో సదరు యాప్స్ అందుబాటులో ఉన్నాయి. అక్కడి నుంచి వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక వ్యక్తిగత ఖాతాను సృష్టించుకోవాలి. పేరు, పిన్‌కోడ్, చిరునామా, ఫోన్ నంబర్ వివరాలను ఎంటర్ చేయాలి. ఆ తర్వాత యాప్ పని చేస్తుంది. ఏ యాప్ లో ఏ వివరాలు ఉన్నాయో చూసుకుని, వాటిల్లో లభ్యమయ్యే సమాచారంతోపాటు సేవల్ని వినియోగించుకోవచ్చు.

డీసీపల్లిలో 829 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం 829 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 971 బేళ్లు వచ్చాయన్నారు. వేలంలో 1,04,170 కిలోల పొగాకును విక్రయించినట్లు వెల్లడించారు. ఒక కిలోకు గరిష్ఠంగా రూ.233, కనిష్ఠంగా రూ.220, సగటున రూ.228.84ల ధర లభించిందన్నారు. 18 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో వరికోత పనుల నిమిత్తం వెళ్లిన లోకేశ్ అనే యువకుడు ఓ బాలికపై లైంగికదాడి చేశాడు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి కథనం మేరకు.. కావలి మండలానికి చెందిన లోకేశ్ కొంతకాలంగా మరుపూరు ప్రాంతంలో మెషీన్‌తో వరికోత పనులకు వెళ్తున్నాడు. అతను తమ కుమార్తెపై లైంగికదాడి చేశాడని తల్లిదండ్రులు పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

సంగం: మండలంలోని మక్తాపురం గ్రామంలో గుర్తుతెలియని వృద్ధురాలు పొలాల్లో చనిపోయి ఉండడాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి కథనం మేరకు.. రైతులు మక్తాపురం గ్రామ సమీపంలో పొలాలకు వెళ్తుండగా ఓ వృద్ధురాలు తిరుగుతూ కనిపించింది. ఆ రైతులు పొలం నుంచి తిరిగి వస్తుండగా ఆమె చనిపోయి ఉంది. దీంతో సంగం ఎస్సై నాగార్జునరెడ్డికి సమాచారమిచ్చారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం తరలించారు. మృతురాలి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.24



రామిరెడ్డికి అండగా ఉంటాం

కావలి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అండగా ఉంటామని రూరల్ పరిధి మన్నంగిదిన్నె పంచాయతీ కొండాయగారిపాళెం వాసులు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన వందమంది తెలుగుదేశం కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మన్నంగిదిన్నె సర్పంచ్ చలంచర్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పల కిరణ్, మన్నెం వెంకటకృష్ణ, వినోద్, వెంకట్రావు, మాల్యాద్రి, ఉప్పాల రమేష్, తిరుపతి, భార్గవ్, గణేష్, మోర్ల శివ, కృష్ణ, ప్రకాష్, రమేష్, రమణయ్య, నాశిన రాములు తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంచితనం వల్లే కావలి ప్రశాంతంగా ఉందన్నారు. వేరే ప్రాంతం నుంచి వారు కావలిలో ఉన్న రౌడీలను అడ్డం పెట్టుకుని ప్రజలపై పెత్తనం చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉండాలన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆదిలక్ష్మి, నేతలు

వైఎస్సార్‌సీపీకే ప్రజా దీవెనలు

- ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ప్రజల దీవెనలున్నాయని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో టీడీపీ తరపున ఎంపీటీసీగా పోటీ చేసిన చల్లకొలుసు మాధవరావు, ఆయన ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమం దుత్తలూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. మొత్తంగా 70 కుటుంబాలు చేరగా, వారికి రాజగోపాల్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైనట్లు చెప్పారు. పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కష్టపడి పనిచేసి జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లురెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి బత్తిన కొండమ్మ, జిల్లా యూత్ కార్యదర్శి బి.మురళి, మండల కో–ఆప్షన్ సభ్యుడు జిలానీ, నాయకులు ఎం.తిరుపతినాయుడు, మల్లికార్జున, బి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

హత్యకు పెట్రోలిచ్చింది తెలుగు తమ్ముడే..

- టీడీపీ నాయకుడి అరెస్ట్
- వివరాలు గోప్యంగా ఉంచిన పోలీసులు

ఆత్మకూరు: ఓ వ్యక్తిపై మహిళ పెట్రోలు పోసి తగులబెట్టింది. ఈ కేసులో పెట్రోలిచ్చింది ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్ నాయుడు (బాబు)గా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. అప్పారావుపాళెం గ్రామం దళిత కాలనీకి చెందిన వజ్రమ్మకు వివాహమైంది. ఇద్దరు కుమార్తెలున్నారు. ఆమె కొన్నేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. ఈ క్రమంలో బేల్దారి పనులు చేసే మస్తాన్‌రెడ్డి అనే వ్యక్తితో పరిచయమైంది. అలాగే వజ్రమ్మకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్ నాయుడితో స్నేహం ఉంది. దీని విషయమై మస్తాన్‌రెడ్డి, ఆమె మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. గతేడాది అక్టోబర్ 3వ తేదీన వజ్రమ్మ ఇంట్లో పిల్లలతో నిద్రిస్తుండగా మస్తాన్‌రెడ్డి పెట్రోలు పోసి తగులబెట్టాలని చూశాడు. ఆమె గ్రహించి పిల్లలతో బయటకు వచ్చేసింది. దీనిపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేశారు. అయినా మస్తాన్‌రెడ్డి, వజ్రమ్మల మధ్య వివాదాలు ఆగలేదు. అతడిని అంతమొందించాలని వజ్రమ్మ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా గత నెల ఆరో తేదీన ఇంటికి పిలిచింది. మస్తాన్‌రెడ్డి వెళ్లి స్నానం చేస్తుండగా బయట తలుపునకు గడి పెట్టింది. లోపల పెట్రోలు పోసి నిప్పు అంటించింది. కాలిన శరీరంతో మస్తాన్‌రెడ్డి తలుపును నెట్టుకొని బయటకు వచ్చాడు. కాపాడాలంటూ వజ్రమ్మ కుమార్తెను పట్టుకున్నాడు. దీంతో ఆ అమ్మాయికి గాయాలయ్యాయి. వజ్రమ్మ అతడిని దూరంగా నెట్టేయగా ఇద్దరూ వెళ్లిపోయారు. మస్తాన్‌రెడ్డి నెల్లూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాగా టీడీపీ నాయకుడు ప్రసాద్ నాయుడి నిర్వాకం బయటపడింది. అతనే పెట్రోలు తెచ్చి ఇచ్చాడని, ఆరోజు అక్కడే ఉన్నాడని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో తొలుత వజ్రమ్మను అరెస్ట్ చేశారు. కొద్దిరోజులకే ప్రసాద్‌నాయుడిని అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరిచారు. కానీ ఈ విషయాన్ని పోలీసులు గోప్య ంగా ఉంచారు. టీడీపీ మండల నాయకుల ఒత్తిడితోనే ఇలా చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఎస్సై ముత్యాలరావును గురువారం సంప్రదించగా డీఎస్పీ, సీఐల ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోందని, ప్రసాద్ నాయుడిని అరెస్ట్ చేసింది వాస్తవేమనని తెలిపారు.



మస్తాన్‌రెడ్డి (ఫైల్)

స్నేహానికి అడ్డుగా ఉందని..

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- తల్లి హత్యకు సహకరించిన కుమార్తె
- నిందితుల అరెస్ట్

నెల్లూరు సిటీ: గత నెల 27వ తేదీన నెల్లూరు మూడో మైలులో జరిగిన మహిళ హత్య కేసులో ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని గురువారం కోర్టుకు హాజరుపరిచారు. వారి కథనం మేరకు.. నాగూర్ ఆదిశేషయ్య, మస్తానమ్మ దంపతులది కిసాన్‌నగర్. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె సునీతకు సురేష్ అనే వ్యక్తితో వివాహం కాగా ఇద్దరు కుమారులున్నారు. విభేదాల కారణంగా ఆరేళ్ల నుంచి సురేష్, సునీత వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో నెల్లూరు వెంకటేశ్వర్లు అలియాస్ నెల్లూరు చంటితో సునీతకు పరిచయమైంది. ఇద్దరూ స్నేహంగా ఉంటున్నారు. కొన్నినెలల క్రితం వారి మధ్య గొడవ జరిగింది. చంటి పలుమార్లు సునీతను కొట్టి వేధింపులకు గురి చేశాడు. దీంతో చంటికి దూరంగా ఉండాలని మస్తానమ్మ తన కుమార్తెకు చెప్పింది. ఈ క్రమంలో మూడో మైలు విజ్ఞేశ్వరనగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని సునీత ఉంటోంది. మార్చి 27వ తేదీన మధ్యాహ్నం చంటి తన కారులో మస్తానమ్మ, సునీత, మూడో మైలులోని ఆర్‌ఎంపీ వైద్యుడు సుబానీని ఎక్కించుకుని విజ్ఞేశ్వరనగర్‌కు వెళ్లాడు. సుబానీ కింద కారులో ఉండిపోయాడు. ముందుగా చంటి కత్తితో మస్తానమ్మ గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. సునీత అడ్డుకోకుండా అతడికి సహకరించింది. హత్య చేసిన అనంతరం ఇద్దరూ సుబానీతోపాటు కారులో వెళ్లిపోయారు. మస్తానమ్మ ఇంటికి రాకపోవడంతో చిన్న కుమార్తె దివ్య అక్క ఇంటికి వెళ్లింది. తల్లి చెప్పులు కనిపించాయి. వెనుక వైపునకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా మస్తానమ్మ రక్తపుమడుగులో ఉంది. స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె చనిపోయి ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మారుతీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు చంటి, సునీత, సుబానీని అరెస్ట్ చేశారు. కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.



పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధంగానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్ట్రన్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

సంయుక్తారెడ్డి,
ఫ్యాషన్ డిజైనర్,
హైదరాబాద్

న్యూస్‌మేకర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరేట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరపున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఏ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు



ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.

ఉగాది పచ్చడి

కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ●చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. **గమనిక:** ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.



ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి

ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.

పాల గారెలు



కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.